కథ

# గారడీ

## –కిరణ్మయి

సుబ్రహ్మణ్యంకి ఆ పూట ఎంత వద్దన్నా ఆనందంగా ఉంది. మనసు, నగిషీల్లేని నాణ్యమైన బంగారు ఉంగరంలా మెరుస్తోంది. సుఖంగా, వెచ్చగా.

మెల్లగా అడుగులేస్తున్నాడు. ఇల్లు ఇంకా దగ్గర కాలేదు. కాసేపు పార్క్‌వైపు వెళ్లచ్చు, చెరువుగట్టు వైపు వెళ్లచ్చు, మూలగా ఉన్న శివాలయం వెనక ఉన్న పాడుబడిన మిద్దె ఎక్కచ్చు. ఆలోచించుకోవచ్చు.

నెమ్మదిగా పడుతున్న అడుగులతో చాలా లెక్క పెడుతున్నాడు. గత నెలంతా సుబ్రహ్మణ్యంకి ఏం భాగాలేదు. పర్సు పోగొట్టుకున్నాడు. అందులో పోయిన ముఖ్యమైన బిల్లుల విషయం తేల్చడానికి తడిసి మోపెడు చేసుకున్నాడు. అద్దె, పాలు, బియ్యం ఎలాగో సర్దాడు కానీ, నెల నెట్టుకు రావడానికి బింకమైన నవ్వు తప్ప చిల్లిగవ్వ దగ్గర లేకపోయింది. ఉన్నది చాలదన్నట్టు, ఆ వెధవ ఆఫీసులో అవమానాలు! తన రిసెర్చ్ పనికి కుంటు.

అంతా అయిపోయింది., ఆట్లో అరటిపండు – గూట్లో గుమ్మడిపండు అన్నట్టు– ఈ నెల కొంచెం మెత్తగా మొదలైంది.

అందరూ నమ్మకంగా, గౌరవంగా మెలుగుతున్నట్టు కనిపించారు. బావుందనిపించింది. సుబ్రహ్మణ్యం మీదే పూర్తి బాధ్యత పెడుతూ పై అధికారి ఓ పని అప్పగించాడు. దానికి కావలసిన డబ్బు, దస్కం, ఆఫీసు సౌకర్యాలు అన్నీ కూడా నిఖార్సుగా కల్పించబడతాయని చెప్పాడు.

అంత జరిగినా సుబ్రహ్మణ్యం అంతగా ఆనందించకపోను. అంతకంటే కొంచెం అనుకోనిదే జరిగింది.

* * *

సుబ్రహ్మణ్యం చూడటానికి నీటుగా ఉంటాడు. చక్కటి నుదురు. చూడగానే తెలివైన వాడనిపించే కళ్లు, తీరైన ముక్కూ, నోరూ. ఓ మాదిరి పొడుగు– కొంచెం ఆత్మ విశ్వాసాన్ని పలికే భుజాలు, చక చక పనిచేసే చేతులు, అలుపు, సొలుపు లేకుండా తిరగగలిగే కాళ్లు– నఖశిఖ పర్యంతం సుబ్రహ్మణ్యాన్ని చూస్తే ఎంచటానికి ఏ లోపం ఉండదు.

అటువంటి సుబ్రహ్మణ్యం అందరినీ ఇట్టే చదివేద్దామనుకుంటాడు. మొదటి పుట నుంచి చివరి పుట వరకు 'బర్ర్'... మని లాగెయ్యగలిగే పుస్తకం, ప్రతి మనిషీ– అనుకుంటాడు. తనకు ఇంట్రెస్టింగ్‌గా అనిపించిన వారిని తను కల్పించిన 'హ్యూమన్ ల్యాబ్' లోకి లాగి, పరీక్షలు, ప్రయోగాలు చేసి వారి స్పందనలను బట్టి వారిని తన మనో పుటలలోకి ఎక్కించుకుంటాడు. అక్కడ ఇండెక్సులు అటూ ఇటూ అయిపోయాయేమో, పేజీలు కలిసిపోయాయేమో– తన సిద్ధాంతాలు తప్పేమో అని ఆలోచించడు! అసలు తన ప్రయోగశాలే గొప్పదన్నట్టు, తన ప్రయోగాల అనుభవం విలువైనదన్నట్టు భావిస్తాడు.

అందుకే సుబ్రహ్మణ్యం ఆనందం రెండు విధాలుగా ఉంటుంది. మామూలు మనుషులు (అంటే పిల్లా పాపలతో హాయిగా బతికెయ్య గలిగే వారు) ఏ వస్తువునో సంపాదించుకుంటే ఆనందపడతారు. టీవీ, ఫ్రిజ్, స్కూటర్, ఇల్లు, కొత్తరకం బట్టలు, కంప్యూటర్– ఇట్లాంటివి (భౌతిక సుఖాలకి సంబంధించినవి). మరి కొంతమంది భావుకులకు స్పృశించగలిగే వాటిపైన పెద్దగా మక్కువ ఉండదు. పరిమళాలు, సంగీతం, చల్లదనం, వెచ్చదనం– లాంటి వాటిని ఇష్టపడుతూ భౌతిక సుఖాల కోసం ఊగిసలాడే వారంటే కాస్త ఎగతాళిగా మాట్లాడుతుంటారు. సుబ్రహ్మణ్యం ఆనందం వీటికి భిన్నంగా ఉంటుంది. మనుషులే అతని ఆనందానికి ముఖ్యం. అదీ, వాళ్లంటే ఏదో ప్రేమ ఉండి కాదు! రకరకాల పరిస్థితులలో ఉన్న రకరకాల వ్యక్తులపై జాలిపడుతూ వారిపట్ల తనకు కలుగుతున్న ప్రతిస్పందనలను పరిశీలించుకుంటూ ఆనందపడుతుంటాడు. రెండోరకం ఆనందం తనకు అన్యాయం చేస్తున్నారనే వ్యక్తులు (దూరం అవుతున్న వాళ్లు) తమ తమ అనుభవాలలో ఖంగుతింటే, బోర్లా పడితే, ఓడిపోతే, కన్నీళ్లు పెడితే– ఆనందిస్తాడు. ఈ రెండో ఆనందంలో అతను ఏరోచితమైన ఉద్వేగాన్ని పొందుతాడు. తన పరిశీలన, ఆలోచన ఎంత నిజమైనవో అర్థం అయి కైపెక్కుతుంది. మరి పట్టపగ్గాలుండవు. కానీ సుబ్రహ్మణ్యం పైకి అలా కనిపించడు. మరి ఎలా కన్పిస్తాడు? నీటుగా, హాయిగా– అప్పుడప్పుడు జాలిగొలిపే దైన్యంతో కనిపిస్తాడు.

నిజానికి సుబ్రహ్మణ్యం ప్రవర్తనని భయపడుతూ, బేరీజు వేసుకునే పరిచయస్తులు అతనిలోని పార్శ్వాలను చూడలేదు. అది సుబ్రహ్మణ్యానికీ తెలుసు. తను మొత్తంగా అర్థం అయిపోతున్నానంటే కాస్త కంగారుపడతాడు. మనసులో పొలమారుతుంది. ఎలాగో ఊపిరి అందుకుని, తన ప్రయోగాలూ అవీ– మామూలే! ఎదుటి వ్యక్తి చెయ్యిలేనిది తను చేస్తున్నాననే నిబ్బరం, కుతూహలం బహుశ అతనికి బతకడానికి దోహదపడుతున్నాయి. అతని ముఖానికి ఒక నిగారింపు తెచ్చిపెడుతున్నాయి. ఈ విషయం సులోచనకి అర్థమయినంత త్వరగా మరెవరికీ అర్థం కాలేదు.

* * *

కొంతకాలం కిందట– ఎన్నాళ్లయింది! ఉద్యోగాల చిట్టా పద్దుల్లో సుబ్రహ్మణ్యానికి, సులోచనకి – ఇద్దరికీ గుర్తులేదు. కొన్నాళ్ల కిందట– అనుమానం అనుమానంగా, భయం భయంగా సులోచన స్నేహాన్ని ఆహ్వానించాడు సుబ్రహ్మణ్యం. ఎందుకు ఆహ్వానించకూడదో, పెద్ద కారణం లేకపోయింది. ఏవో వీళ్ళూ, వాళ్లూ చెప్పారు! అంతమాత్రానికి అనుమానింపచేస్తాడా? చెయ్యలేదు. కొంత పరిచయం పెరిగింది. సుబ్రహ్మణ్యం యథేచ్ఛగా తన ప్రయోగాలు చేసుకుపోతున్నాడు. నిజాయితీ, అబద్ధం, నిజం, భయం, సంబంధాలు, స్నేహం, అసూయ, మంచితనం వీటన్నిటినీ బాగా ఆకళింపు చేసుకోవాలనే అతని ప్రయత్నంలో ప్రాణం ఉన్న కళేబరాలను చాలానే చూసింది సులోచన. వాటి వలన అతనికి బాగా ఉపయోగంగా ఉందా? అని ఎప్పటికప్పుడు ఆలోచించేది. ప్రయోగాల పరంపరలో సుబ్రహ్మణ్యంకి ఒళ్ళూపై తెలియదు. చిన్న చిన్న అబద్ధాలు, చిన్న ప్రచారాలు, సమాచార సేకరణ, విస్తరణ– చాలా చేసేవాడు. జవాబ్‌దారీగా ఉండక్ఖర్లేని పరిస్థితి కల్పించుకోగలిగే తెలివితేటలు ఉన్నాయి.

సులోచన లోని నిక్కచ్చితనం, మంచితనం, ఏవో బాగానే ఉన్నట్టు అనిపించాయి కానీ, సులోచనే ఎందుకో పూర్తిగా చేతిలోకి చిక్కకుండా జారిపోతూ అతన్ని ఇబ్బంది పెట్టింది. అంతే.

* * *

చుట్టూ అందమైన, విచిత్రమైన విషవలయం.



అనేక విధాలుగా ప్రపంచాన్ని స్పృశించడం సులోచనకి రివాజయింది. చిన్న అభిమానించిన వారు ఈరోజు ఈసడించుకోవడం, తీవ్రంగా ప్రేమించే వాళ్లు తారసపడి తబ్బిబ్బు చెయ్యడం, ఏ కారణమో తెలియకుండా అనుమానించడం, ఆ అనుమానం ఆధారంగా చేతలని డిటర్మిన్ చెయ్యడం, చిన్న-పెద్ద విషాదాల మధ్య తేడా చూపించటానికన్నట్టు కొంతమంది చనిపోవడం, వారి శవాల్ని చూస్తూ వేలగా, అలసటగా మరొకరికి అండగా నిలబడడం, – చావు-పుట్టుక! మధ్యలో గాజు బొమ్మల్లా రకరకాల స్థానాలలో అమర్చబడుతూ, మనుషులు!

అందరినీ నిశ్శబ్దంగా పరిశీలించుకునే సులోచనకి సుబ్రహ్మణ్యం గారడీలు చేసేవాడిలా అనిపించాడు. చాలా సీరియస్ విషయాల కోసం, వాటి గుర్తింపు, గ్రహింపు కోసం పల్టీలు కొట్టించి, 'బందర్ తమాషా' చూపించే పేద గారడీ వాడులా కనిపించాడు. కోతి లక్షణాలన్నీ గారడీ వాడికే ఆపాదించేసే ప్రపంచం ఇది అని, పాపం, అతనికి తెలియదు! సులోచనకి అతనిమీద తీవ్రమైన జాలి, ఇష్టం, అభిమానం కలిగాయి. స్నేహంగా ఆహ్వానించింది.

* * *

"బందర్ తమాష ఎట్ల నడిచింది"

"బలె బాగుంది పిన్నమ్మా!"

"ఏం జేసింది!"

"ససురాల్‌కి పోతనని మారం జేసింది! బిందె నెత్తికెత్తుకుంది, ఇట్లా... నడిచింది"– చిన్న సీత అభినయిస్తూ చూపితే సుబ్రహ్మణ్యం, సులోచన ఫక్కుమన్నారు. సుబ్రహ్మణ్యం అక్క కూతురు. సులోచన అక్కడకి రావడం సుబ్రహ్మణ్యంకి నచ్చింది. నవ్వులు, కబుర్లు. సులోచన ఏం

ప్రశ్నలు వెయ్యిలేదు. అతను ఎదురుచూశాడు. తన ప్రయోగశాలకు అతీతంగా, విశాలంగా ఆమె విస్తరించి ఉండడం అతడి మెత్తటి మనసులో ముల్లులా గుచ్చింది. ఆమె ఏదైనా ప్రశ్న వేస్తే బావుండు, అనుకున్నాడు. సులోచనకి ఎందుకో ఆ సాయంత్రం భయం వేసింది.

మగవారి ప్రపంచం చాలా విచిత్రంగా ఉంటుంది. వారి భయాలు, బింకాలు, కోరికలు, కోపాలు, అహంకారాలు, అర్థమయినంత నిజాయితీగా ఉండవు. వాటి పూర్తి ప్రతిబింబ స్వరూపం, భిన్నమైన కట్టు, బొట్టుతో ఆడవారి జీవితంలోకి ప్రవేశిస్తుంది. మధ్యలో ఉన్న అద్దం భళ్లు మనగానే అంతా మాయం! కేవలం భయాలు, బింకాలు, కోరికలు, కోపాలు, అహంకారాలు కనిపిస్తాయి. అత్యంత నగ్నంగా.

తనొక్కదానికే అర్థమైన సుబ్రహ్మణ్య స్వరూపం- సులోచనని కలవర పెట్టింది. తనను నమ్మి, ఇష్టపడి, అభిమానించిన సుబ్రహ్మణ్యం, వీలైతే పిడికిలిలో ఏదో విధంగా ఒడిసి పట్టుకుందామనుకున్న సుబ్రహ్మణ్యం, రోజు రోజుకీ భయంతో, బింకంతో, కోరికతో, కోపంతో- అందంగా మెరుస్తూ, నమ్మకంగా మసులుకుంటున్న సుబ్రహ్మణ్యం, తను విస్తరించగల అంచుల్ని వెతుకుతున్నాడు.

సులోచన నిశ్శబ్దంగా అతని ప్రయోగశాలలోకి నడిచింది. అతన్నుంచి కొన్ని విషయాలలో తప్పించుకు తిరిగింది.. గారడీ రహస్యాలు అతనికి అర్థమయ్యేంత వరకూ అటూ ఇటూ తిరిగింది. అర్థమైతే అతనే వాటిని వదిలేస్తాడనుకుంది. కానీ... సుబ్రహ్మణ్యం స్నేహానికి ఇచ్చే విలువ, స్వార్థానికి అతీతమైంది కాదు! అతని ప్రయోగంలో తను ఓడిపోతే సుబ్రహ్మణ్యం ఎంత ఆనందపడతాడో సులోచనకేం కొత్తకాదు.

"సులోచన, సుబ్రహ్మణ్యం...పాపం, ప్చ్!"

"వెరీ శాడ్!"

"అతనికి మొదట్నుంచీ ఏదో కొంచెం రిజర్వేషన్స్ ఉన్నట్టున్నాయి!"

"ఆ! ఆవిడే అతని వెంట వెంట పడింది! అతను నెమ్మదిగా తప్పుకున్నాడు-"

"ఆవిడకి కొంచెం ఆవేశం ఎక్కువ! అబద్ధాలు కూడా ఆడేదట!"

"అలావా?"

"ఎనీవే! లెట్స్ లీవిట్!"

సుబ్రహ్మణ్యంకి అర్థం కాని వెలుగుని ఎవ్వడూ గుప్పెట్లో పెట్టుకోవాలనిపించదు. ఆనందంగా ఉంది. సులోచనని తన జీవితంలోంచి బయటకు పంపెయ్యగలిగాడు. ఈ మధ్యలో అతను ఏం మాట్లాడినా అది సులోచన మంచి కోసమే, బాగు కోసమే! తనను బాగు చేద్దామనో, ఉద్ధరిద్దామనో ఎవరైనా వస్తే తనూ అసలు భరించలేడు! తనను చూసి జాలిపడితే,- ఛీ! అయినా సులోచన మంచిది! ఆమెదేం తప్పులేదు. తన జీవితంలోకి ఆహ్వానించింది- అంతే! కానీ తను అలాంటి జీవితాలలో తట్టుకోలేడు. తన ప్రతి కదలిక, ఉద్దేశం అర్థమయిపోతే తను బతకలేడు. ఎదుటివారి వెలుగులో తన జీవిత మార్గం కనిపించకూడదు. తనే వెతుక్కోవాలి. ఈ ప్రయోగాలన్నీ మరెందుకన్నట్టు? సులోచన సూర్యోదయాలలాగానో, సూర్యాస్తమయాల్లానో వచ్చి పోతుంటే ఫర్లేదు. పాపం! సులోచన మంచిదే! వెళ్లే రోజు కూడా చిరునవ్వుతోనే వెళ్లింది. ఆమె మనసు విరిగిపోయి ఉంటుందనుకున్నాడు. కాస్త తడితడిగా ఆమె కళ్లు కనిపిస్తాయేమో అనుకున్నాడు. ఏదో ఒకటి రెండు సార్లు సూటిగా చూసింది. తల తిప్పుకుని పక్కవారివైపు చూసి చిరునవ్వు నవ్వింది. ఉద్యోగం రాజీనామా చేసింది. పాపం, ఇంట్లో వాళ్ల నాన్నకు ఏం బాగా లేదట. అయినా ఏదో ఒకటి రెండు నెలల పని దొరికిందట. ఇంట్లోనే ఉండి రాయాల్సిన పని. కొంచెం లోతుగా ఆలోచించగల అమ్మాయి. అపుడు తనకు చాలా ఇష్టం!

సుబ్రహ్మణ్యం శివాలయం ప్రాంగణంలోకి అడుగుపెట్టాడు. ఎదురుగా పెద్దచెట్టు. దాన్ని అల్లుకుని, 'శివుడికిష్టమైన పూలు' రాల్చే పరాన్నభుక్కు పూల తీగ.

కింద రాలిన ఒక పువ్వు తీసుకుని ఆ తీగవైపు చూశాడు. మనసులో ఆనందం. స్త్రీల జీవితం మీద తను చేస్తున్న అధ్యయనం గుర్తొచ్చింది. వారికి లభించవలసిన స్వేచ్ఛ మీద ఏం రాయాలో నిర్ణయించుకున్నాడు.

పక్కనే, గోడలోకి వంకర టింకరగా వేళ్లు తన్నేసిన రావిచెట్టు, కింద తడిగా నేల- అతని చూపులకు ఆనలేదు.


పైన రావి ఆకులు సుబ్రహ్మణ్యాన్ని ఆట పట్టిస్తున్నట్టు గల గల మన్నాయి.

అతనికి అవి చప్పట్లలా వినిపించాయి.



## ఫలితం దక్కని సొనాలీ

డూప్లికేట్ సినిమాలో జూహీ చావ్లాతో పోటీ పడి నటించి, తన శరీరపు వంపు సొంపుల్ని యథేచ్ఛగా పరచినా చివరికి పేరు మాత్రం జూహీ చావ్లా కొట్టుకు పోయింది. అలాగే మరో పూజాభట్ సినిమాలో కూడా గ్లామర్ పేరుతో సొనాలీని పూర్తిగా చూపించినా, సినిమా హిట్టయ్యేసరికి పేరు పూజాభట్‌కే పోయింది. సరైన గుర్తింపు కోసం ఇక ఉన్నవి కూడా వది లేయాలో ఏంటో ఖర్మ అంటోంది సొనాలీ బింద్రే.



## నిర్మాతగా అజయ్ దేవగన్

హీరోలుగా సంపాదించిన డబ్బు మళ్లీ పెట్టుబడి పెట్టడానికి సినిమాల కంటే లాభసాటి వ్యాపారాలు దొరక్క నిర్మాతలుగా మారుతున్నారు నేటి హీరోలు. ఆ వరుసలో అజయ్ దేవగన్ కూడా ఇష్క్, ప్యార్‌తో హోనా హీథా లాంటి సినిమాలు తీశాడు. ఇప్పుడు మళ్లీ గోవింద్ నిహలానీతో తక్షక్, ప్రకాష్ ఝా దర్శకత్వంలో, తాను, కాజోల్, జూహీచావ్లా, చంద్రచూర్‌లు నటించగా 'దిల్ క్యాకరే' తీస్తున్నాడు.